క్లుప్తంగా

రమాబాయి ఆత్మస్థైర్యం మహిళలకు ఆదర్శం

కర్నూలు(అర్బన్): రమాబాయి అంబేడ్కర్ ఆత్మస్థైర్యం మహిళలందరికీ ఆదర్శమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. సోమవారం రమాబాయి 89వ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి మహిళా నేతలు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు ఎనలేనివి



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళ్లులర్పిస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్) : భారతదేశానికి మొదటి ప్రధానమంత్రిగా నెహ్రూ చేసిన సేవలు ఎనలేనివని,ఆయన హయాంలో ఎన్నో పరిశ్రమలను స్థాపించి దేశానికి ఉపాధి చూపారని కర్నూలు జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. సోమవారం నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, నాయకులు షేక్ జిలానీ బాషా, వెంటన్న, పీజీ నరసింహులు, అనంతరత్నం మాదిగ, సత్యనారాయణగుప్తా పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఖరీఫ్ రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు రైతులను ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..2023 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన వారందరికీ పరిహారం చెల్లించాలన్నారు. బ్యాంకుల నుంచి తక్షణమే రుణాలు రెన్యువల్ అయ్యేలా చూడాలన్నారు. వర్షాలు పడుతుండడంతో బ్యాంకులు కొత్తగా అప్పులు ఇచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి.రాజాసాహెబ్, జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

రామరాజ్య స్థాపనే ధ్యేయం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న శారదాపీఠం స్వామీజీ శివయోగీంద్ర భారతి

కర్నూలు(సెంట్రల్): దేశంలోని యువత ధ్యేయం రామరాజ్య స్థాపన కావాలని శారదాపీఠం స్వామీజీ శివయోగీంద్ర భారతి పేర్కొన్నారు. సోమవారం కర్నూలులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఆ సంఘం దక్షిణాంధ్ర రాష్ట్ర బజరంగ్‌దళ్ కన్వీనర్ తూంకుంట ప్రతాపరెడ్డి దక్షిణాంధ్రప్రదేశ్ బజరంగ్‌దళ్ కార్యకర్తల ఏడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శివయోగీంద్ర భారతి మాట్లాడుతూ..ప్రపంచంలో దేశానికి ఇంత పేరు ఉందంటే అందుకు హిందుత్వమే కారణమన్నారు. ఇక్కడకు వచ్చిన 16 జిల్లాలోని 200 మందిని చూస్తే రామరాజ్యం సిద్ధించినట్లు అగుపిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా బజరంగ్‌దళ్ భాగ్యనగర్ క్షేత్ర కన్వీనర్ వీర కుమార్‌స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయి రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాల విరాళం



పుస్తకాలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులకు అందజేస్తున్న కంగెరమోహన్

కర్నూలు(సెంట్రల్): సమాజ అవగాహన కోసం ప్రతి ఒక్కరూ పుస్తకాలను చదవడం అలవాటుగా చేసుకోవాలని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కంగెర మోహన్ అన్నారు. సోమవారం ఆయన పలు సాహిత్య పుస్తకాలను ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యాలయానికి విరాళంగా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కంటే సెల్‌ఫోన్‌లో ఎక్కువగా కాలం గడడం చూస్తుంటే భయమేస్తోందన్నారు. కాగా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర అధ్యక్షుడు అమర్ ఆయన నుంచి పుస్తకాలను స్వీకరించి కృతజ్ఞతలు తెలిపారు.

పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపు

- సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి
- ఉదయం 7 గంటలలోపు కౌంటింగ్ ఏజెంట్లు రిపోర్టు చేయాలి
- ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ వెల్లడి



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు అసెంబ్లీ ఆర్‌ఓ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): వచ్చేనెల 4 వ తేదీన నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని చెప్పారు. సోమవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారికి అధికారిక ప్రతినిధులు, పోలీసు సిబ్బందితో రిటర్నింగ్ అధికారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 31 వ తేదీ నాటికి ఫారం 18 సమర్పించి గుర్తింపు కార్డులు పొందిన కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు వచ్చే నెల 4 వ తేదీన ఉదయం 7 గంటల లోపు రాయలసీమ యూనివర్సిటీలో రిటర్నింగ్ అధికారికి రిపోర్టు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు నిరంతరం నిఘాలో ఉంటాయన్నారు. భారీగా పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించమని చెప్పారు. ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో వాటిని డిపాజిట్ చేయాలన్నారు. అలాగే ఏ టేబుల్‌కు కేటాయించిన కౌంటింగ్ ఏజెంటు ఆ టేబుల్ వద్దే ఉండాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటుపై ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల గురించి సమావేశంలో రిటర్నింగ్ అధికారి అవగాహన కల్పించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడెంచల భద్రత

కర్నూలు డివిజన్ డీఎస్పీ విజయ శేఖర్ మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడెంచల భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. కౌంటింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రానికి 2 కిలో మీటర్ల పరిధిలో అలాగే 1 కిలో మీటర్ పరిధిలో 9 కట్ ఆఫ్ చెక్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ శాంతియుతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చెప్పారు. సమావేశంలో కర్నూలు అర్బన్ తహసీల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్ కుమార్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, మెప్మా పీడీ. నాగశివలీల, ట్రైనీ డీఎస్పీ భావన, రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

కర్నూలు(సెంట్రల్) : రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారు. డోన్ జీవీఆర్ఎస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఒకరు, బేతంచెర్ల శ్రీవివేకానంద డిగ్రీ కాలేజీలో మరొకరు డీబార్ అయ్యారు. కాగా, నాలుగో సెమిస్టర్ సోమవారం జరిగిన పరీక్షకు 89 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 2,995 మంది విద్యార్థుల్లో 2,670 మంది పరీక్ష రాశారు.

ఇద్దరికి ఎన్టీఆర్ పురస్కారం

కర్నూలు(అర్బన్): జిల్లాకు చెందిన ఇద్దరు రంగస్థల కళాకారులకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారాలు లభించాయి. జిల్లా టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు హనుమంతరాయ చౌదరి, ఎమ్మిగనూరుకు చెందిన బైలుప్పల షఫీఉల్లా ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా నేడు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే వేడుకల్లో వారు అవార్డులను అందుకోనున్నారు. 40 ఏళ్లుగా కళారంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఎన్టీఆర్ జాతీయ పురస్కారానికి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని వారు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు.

కచ్చితమైన ఫలితాలు ప్రకటించాలి

- జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): జూన్ 4వ తేదీన చేపట్టే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను త్వరిగతిన కచ్చితమైన విలువలతో ప్రకటించాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల మార్గదర్శకాలు పాటిస్తూ ఫలితాల ప్రకటనలో జాప్యం ఉండకూడదన్నారు. సోమవారం ఢిల్లీ నుంచి ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సీఈఓలు, జిల్లా ఎన్నికల అధికారులు, ఆయా నియోజకవర్గ ఆర్వోలతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌తోపాటు కమిషనర్‌లు జ్ఞానేష్‌కుమార్, డాక్టర్ సుఖ్బీర్‌సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ..కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద జనాలు లేకుండా చూసుకోవాలన్నారు. నిర్ణీత పాసు లేకుండా ఎవరినీ అనుమతించొద్దని సూచించారు. పవర్ బ్యాంకు, పవర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందజేసేందుకు అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు చేపట్టాలని, తరువాత ఈవీఎంలను లెక్కించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

పాణ్యం కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లు పూర్తి



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్) : పాణ్యంకు సంబంధించి కౌంటింగ్ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆ నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి తెలిపారు. సోమవారం ఆమె ఆర్‌యూలో ఏర్పాటు చేసిన పాణ్యం కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ఇంజినీరింగ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి ఎంట్రీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్ల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీకి 14, పార్లమెంట్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 26 రౌండ్లలో ఫలితాలను విడుదల చేయనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి సిబ్బంది, ఏజెంట్ల ఫోన్లతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించమని, అయితే వాటిని ఏర్పాటు చేసిన సెంటర్లలో భద్రపరుచుకోవచ్చని సూచించారు. ఆమె వెంట కల్లూరు తహసీల్దార్ మునివేలు, ఆర్‌అండ్‌బీ డీఈ భారతి ఉన్నారు.

ఆదర్శ వివాహం



ఆదర్శ వివాహం చేస్తున్న కుల, ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేవీపీఎస్, ఆర్‌వీఎస్ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం జరిగింది. సోమవారం రజక వృత్తిదారుల సంఘం కార్యాలయంలో చాకలి వినయ్, రాచపోగుల ఎరిష ఒక్కటయ్యారు. నగరంలోని కృష్ణారెడ్డి నగర్‌కు చెందిన చాకలి వినయ్, నంద్యాల జిల్లా డోన్ మండలం ధర్మవరానికి చెందిన రాచపోగుల ఎరిష ప్రేమించుకున్నారు. అయితే వారి పెద్దలు వివాహానికి అంగీకరించకపోవడంతో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు, ఆర్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్‌ను సంప్రదించారు. వీరు ఆ ప్రేమికులకు వివాహం జరిపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ప్రజాశక్తి మేనేజర్ టి.నరసింహ, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ పాల్గొన్నారు.

అమిత హాస్పిటల్ తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఎన్‌ఆర్ పేటలో ఉన్న అమిత హాస్పిటల్‌ను సోమవారం డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల వారు రికార్డులు, రిపోర్టులు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, లేకపోతే పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత ఉన్నారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. సోమవారం సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.15,500, మధ్యస్థ ధర రూ.14,000, కనిష్ట ధర రూ.13,000గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.5000, మధ్యస్థ ధర రూ.4,500, కనిష్ట ధర రూ.4,000గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారస్తుల వద్ద సరకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

దద్దణాల అభివృద్ధికి రూ.14 కోట్లతో ప్రతిపాదనలు



దద్దణాల ప్రాజెక్టు

బనగానపల్లె: మండలంలోని దద్దణాల ప్రాజెక్టు అభివృద్ధికి రూ.14 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ రఘురామ్ సోమవారం తెలిపారు. నిధులు మంజూరు కాగానే ప్రాజెక్టుకు చెందిన ఒక గేట్‌ను మార్చడంతో పాటు ఆనకట్ట పటిష్టత, గదుల నిర్మాణం, త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు పరిధిలో 1,513 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు.

మురుగు పారదు.. సమస్య తీరదు



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రైనేజీ

కల్లూరు: కల్లూరు అర్బన్ 21వ వార్డు శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయి. దోమలు, ఈగలు, లార్వాలు అభివృద్ధి చెంది వ్యాధులు వచ్చే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీరు, మురుగు సాఫీగా వెళ్లడానికి ప్లాస్టిక్ పేపర్లు, కవర్లు అడ్డుగా ఉంటున్నాయని.. దీంతో నిల్వ చేరి దుర్గంధం వ్యాపిస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- జాబ్ అచీవర్స్ డే వేడుకల్లో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్



ఉద్యోగాలకు సంబంధించిన ఆఫర్ లెటర్లు అందుకున్న విద్యార్థులతో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు సిటీ: కోర్సు ఏదైనా అందులో నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులువుగా లభిస్తాయని కర్నూలు ప్రభుత్వ పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకట రంగారెడ్డి అన్నారు. నగర శివారులోని బి.తాండ్రపాడు దగ్గర ఉన్న ఎస్.జి. పుల్లా రెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం జాబ్ అచీవర్స్ డే వేడుకలు నిర్వహించారు. పాలిటెక్నిక్ కోర్సులను అభ్యసించిన విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి అందుకు సంబంధించిన ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు ఉండాలంటే ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఎం.వి.ఎస్.ఎస్.ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఎస్.జి. పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన 69 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని, మంచి ప్యాకేజీలతో తమ పిల్లలు ఉద్యోగాలు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

చిటారు కొమ్మన చిగురు కోయగలనే!



కల్లూరు: చెట్టులెక్కగలవా.. ఓ నరహరి పుట్టలెక్కగలవా? చెట్టులెక్కి ఆ చిటారు కొమ్మన చిగురు కోయగలవా ఓ నరహరి చిగురు కోయగలవా?.. అంటూ ఓ పాటలో కథానాయిక సవాల్ విసురుతుంది.. అందుకు ప్రతిగా చెట్టు లెక్కగలనే ఓ చెంచిత పుట్టలెక్కగలనే.. చెట్టులెక్కి ఆ చిటారు కొమ్మన చిగురు కోయగలనే అంటూ కథనాయకుడు సమాధానం ఇస్తాడు. ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ పాటను గుర్తు చేసేలా కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలోని చింత వనంలో జీవనోపాధి కోసం కొందరు చింతచెట్టు ఎక్కి చిటారు కొమ్మన చిగురు కోస్తూ కనిపించారు.

కేవీఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



జఫూరుల్లా బేగ్

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ఇంగ్లిషు లెక్చరర్ ఎం.జఫ్రూరుల్లా బేగ్‌కు రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.శామ్యూల్ సెల్వన్ నవలలోని అంశాలపై యోగి వేమన యూనివర్సిటీ రిటైర్డ్ ఇంగ్లిషు ఆచార్యులు జి.గులామ్ తారిక్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు ఈ అవార్డు లభించినట్లు జఫూరుల్లా తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనను కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

అగ్ని ప్రమాదంలో గేదెలకు గాయాలు

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో గేదెలకు గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి చిన్నటేకూరు గ్రామానికి చెందిన హిమేశ్వరయ్య కొట్టం కాలిపోయింది. అక్కడ కట్టి ఉంచిన రెండు గేదెలకు 70 శాతం గాయాలయ్యాయి. సోమవారం చిన్నటేకూరు పశువైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి గాయలను పరిశీలించి వైద్యం చేశారు.

1న లొద్దిపల్లెలో భజన పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో జూన్ 1వ తేదీ జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హనుమద్‌జయంతి సందర్భంగా శనివారం స్థానిక వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే బృందాలకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు దాతలు ఆర్.నాగేశ్వరరెడ్డి, నారాయణ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల భజన బృందాలు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9704842047, 9849581378 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కర్నూలు (అర్బన్): ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన కర్నూలు వన్‌డిపో బస్సు (ఏపీ 21 జెడ్ 0821) ప్రమాదవశాత్తు పెద్దపాడు వద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. 14 మంది ప్రయాణికులతో సోమవారం రాత్రి ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు వచ్చేటప్పుడు ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కండక్టర్ ముర్తుజావలి చేయి విరిగిపోగా, కానిస్టేబుల్ రాముడు, హోంగార్డు వేణుగోపాల్, ప్రయాణికురాలు మౌనికకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్త కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు డిపో డీఎం సుధారాణి తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సరళమ్మ

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను పాణ్యం జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల రైతుల్లో ఉత్సాహం, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. విజేతలకు రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి వృషభాలతో వచ్చిన రైతులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. అలాగే ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, సీఎస్ఐ చర్చి నిర్వాహకులు, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

శ్రీగిరి కిటకిట



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలతో శ్రీగిరి చేరుకుంటున్నారు. సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 4గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్న భక్తులకు తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి. మల్లన్న దర్శనం అనంతరం తమ పిల్లలకు క్షేత్ర పరిధిలోని శ్రీశైలం ప్రాజెక్టు సందర్శిస్తూ ఆధ్యాత్మిక అనుభూతితో పాటు పర్యాటక అనుభూతిని పొందుతున్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల తనిఖీ



ఆర్‌జీఎంలో సిబ్బందికి సూచలు ఇస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్‌రూమ్‌లను నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆకస్మికంగా సోమవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉందన్నారు. డీఎస్పీ స్థాయి అధికారితో పాటు కేంద్ర, రాష్ట్ర బలగాలు 24 గంటలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా అందుబాటులో జనరేటర్లు ఉంచామన్నారు. కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ కెమెరాల ద్వారా స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పర్యవేక్షిస్తున్నామన్నారు. కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎటువంటి గొడవలకు పాల్పడకుండా గ్రామ సభల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తప్పుడు సమాచారాలతో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే పోలీసుశాఖ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, పాణ్యం సీఐ నల్లప్ప తదితరులు ఉన్నారు.